క్లుప్తంగా

తప్పులు లేకుండా సవరించండి



ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు లిస్టు నమోదు చేస్తున్న కార్యదర్శులు

శివ్వంపేట(నర్సాపూర్): ఓటరు లిస్టులో తప్పులు లేకుండా సవరణ చేయాలని ఎంపీఓ తిరుపతిరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఓటరు లిస్టును ఆధారంగా తీసుకొని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. కుటుంబానికి చెందిన అందరి పేర్లు ఇకేచోట, ఒకే వార్డులో వచ్చేలా సవరణ చేసి, ఆన్‌లైన్ చేసే ప్రక్రియ వేగంగా నిర్వహిస్తున్నారు. రానున్న పంచాయతీ ఎన్నికలకు ఓటర్ లిస్టును సమగ్రంగా తయారు చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం నమోదు చేస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర్, ఎంపీఓ తిరుపతిరెడ్డి తెలిపారు.

పాఠశాలలో క్రీడాపోటీలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో పీడీ రమేశ్ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. దీంతో పాటు మండలంలోని వివిధ పాఠశాలలో విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ తదితర క్రీడలు నిర్వహించారు. పాఠశాల స్థాయి పూర్తయిన తర్వాత ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఓపెన్ జిమ్‌కు విరాళం



విరాళం అందిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో మంగళవారం ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఓపెన్ జిమ్ ఏర్పాటుకు తన వంతుగా విరాళం అందించారు. ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలో ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోతున్న ఓపెన్ జిమ్‌కు తనవంతుగా రూ. 15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ మనిషి ఈ రోజుల్లో ఆరోగ్యంగా ఉండడానికి ప్రతీరోజు వ్యాయమం అవసరం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జీపీ స్వామి, వెంకట్‌రెడ్డి, సిద్ధరాంరెడ్డి, ప్రసాద్, తిరుపతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ బుచ్యానాయక్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఎస్.కొండాపూర్ మదిర గ్రామమైన ప్యాట గడ్డ పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో అక్కడ ఉన్న ఇద్దరి ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేసినట్లు ఎంఈఓ బుచ్యానాయక్ తెలిపారు. మంగళవారం ప్యాటగడ్డ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు బ్రహ్మం, హన్మంతులను ఇతర పాఠశాలలకు పంపినట్లు తెలిపారు. ఆయన వెంట కాంప్లెక్స్ హెచ్ఎంలు దీప్లారాథోడ్, సాయిరెడ్డి ఉన్నారు.

రుణమాఫీపై దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల లోపు రుణమాఫీ కాని వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.2 లక్షల లోపు రుణాలు ఉండి మాఫీ కాని రైతులు నిజాంపేటలోని రైతు వేదికలో వారి పట్టాపాస్ బుక్, ఆధార్‌కార్డు వివరాలతో రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రూ.2 లక్షల కంటే ఎక్కువగా ఉన్న వారు మాత్రం పై అధికారుల ఆదేశాల మేరకు రైతుల నుంచి దరఖాస్తు తీసుకుంటామన్నారు. ఇందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి శ్రీలత, కావేరి రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాకు రుణమాఫీ చేయరా..?

రేగోడ్(మెదక్): రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రుణమాఫీ అవుతుందా.. కాదా అని కొందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కొందరికి రుణాలు మాఫీ అయినా.. ఇంకా చాలా మంది రైతులకు రుణాలు మాఫీ కాకపోవడంతో.. రుణాలు మాఫీ చేయండి సారూ.. అంటూ మొర పెట్టుకుంటున్నారు.

రేగోడ్ మండలంలో సుమారు పదివేల మంది రైతులు ఉన్నారు. మొదటి విడతలో 1,531 మంది రైతులకు రూ.8 కోట్లు 34 లక్షలు మాఫీ అయ్యాయి. రెండో విడతలో వెయ్యి మంది రైతులకు రూ.9 కోట్లు 73 లక్షలు మాఫీ అయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రెండు విడతల్లో కూడా కొందరికీ రుణాలు మాఫీ కాలేదు. మూడో విడతలో రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని రైతులు వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 240 మంది రైతులు తమ రుణాలు మాఫీ కాలేదని, రుణాలు మాఫీ చేయాలని అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. అందరికీ ఒకేమారు రుణాలు మాఫీ చేయకుండా ఇలా కొర్రీలు పెట్టడం ఎంతవరకు సమంజసమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబంధు ఊసే లేదని, ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం సకాలంలో అందకపోవడంతో పంటల సాగుకు అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి అందరి రుణాలు మాఫీ చేసి, రైతుబంధు నిధులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



రుణం మాఫీ చేయాలని ఏఓకు వినతిపత్రం అందిస్తున్న రైతు

మాటను నిలబెట్టుకోవాలి



నాకు రూ.2 లక్షల రుణం ఉంది. మూడో విడతలో కూడా మాఫీ కాలేదు. ఎన్నికల సమయంలో అందరికీ ఒకేమారు రుణమాఫీ అన్నారు. చెప్పింది ఒకటి.. చేస్తుంది మరోలా ఉంది. పూర్తి స్థాయిలో రుణాలు మాఫీ చేసి మాటను నిలబెట్టుకోవాలి.

– నాగమణి, రైతు దోసపల్లి

డబ్బులు కట్టమంటున్నారు..



నాకు నాలుగు ఎకరాల భూమిపై రూ.2 లక్షల 50 వేలు అప్పు ఉంది. మూడు విడతల్లో కూడా మాఫీ కాలేదు. మాఫీ కోసం వెళితే డబ్బులు కట్టమంటున్నారు. ఆ డబ్బుల కోసం మళ్లీ అప్పు చేయాలా.. ? ప్రభుత్వం స్పందించాలి.

– సాయిలు, రైతు కొత్యాన్‌పల్లి

240 దరఖాస్తులు



రుణమాఫీ కాలేదని 240 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. రైతుల పట్టా పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిస్తాం. అర్హులకు రుణాలు మాఫీ అవుతాయి.

– జావీద్, ఏఓ రేగోడ్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. డంప్ యార్డు సమీపంలో వ్యవసాయ బోర్ల వద్దకు ఉన్న త్రీ ఫేజ్ కనెక్షన్ తీగలకు సపోర్ట్‌గా ఉంచిన కర్రలు విరిగిపోవడంతో విద్యుత్ తీగలు పంటచేనులో పడిపోయాయి. ఈ విషయమై పక్షం రోజులుగా విద్యుత్ అధికారులకు చెప్తున్నా.. వారు స్పందించడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పంటచేనులో పడిపోయిన విద్యుత్ తీగలతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, మరమ్మతులు చేపట్టాలని వేడుకున్నా.. పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రాణాప్రాయం సంభవించకముందే తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఏదేని ప్రమాదం జరిగితే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.



పంట చేనులో పడిపోయిన విద్యుత్ తీగలు

రావి కోటేశ్వరావు అడుగుజాడల్లో నడవాలి



రాయిలాపూర్‌లో రావి కోటేశ్వరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): స్వాతంత్ర్య సమరయోధుడు, పాఠశాల భూదాత రావి కోటేశ్వరరావు అడుగుజాడల్లో నడవాలని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాయిలాపూర్‌లో రావి కోటేశ్వరరావు శతజయంతి వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కుటుంబ సభ్యులు, నాయకులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోటేశ్వరవార్ భార్య కామక్షమ్మ, ఎన్ఆర్ఐలు రుద్రమ్మ, దేవయ్య, సిద్దార్థ, రాహుల్, సతీష్‌తో పాటు మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సతీస్, మాజీ సర్పంచ్ శేఖులు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, డైరెక్టర్ నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కులజనగణన చేపట్టాలి: సాయిలు

టేక్మాల్(మెదక్): రాష్ట్రంలో కుల జనగణన ప్రభుత్వం వెంటనే చేపట్టాలని సగర సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు సాయిలు సగర అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లంపల్లిలో సగరకుల జనగణన కార్యక్రమం చేపట్టారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర నాయకత్వంలో తాము 32 అంశాలతో కూడిన సమగ్ర సమాచారంతో సగర కుల జన గణనను ప్రారంభించినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సగర సంఘం సంయుక్త కార్యదర్శి దత్తాత్రేయ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ సగర, జిల్లా కోశాధికారి బాలకిషన్ సగర, జిల్లా యువజన సంఘం కోశాధికారి సాయిలు సగర, గ్రామ నాయకులు, గ్రామ సగర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల నిర్వహణ చేపట్టాలి

చిన్నశంకరంపేట(మెదక్): పాఠశాల స్థాయి క్రీడాపోటీల నిర్వహణకు సంసిద్ధం కావాలని ఎంఈఓ బుచ్యానాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పాటు క్రీడాపోటీల నిర్వహణకు పీడీలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు బాధ్యతలు తీసుకొని క్రీడలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని చెప్పారు. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు దీప్లారాథోడ్, సాయిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ శివప్రసాద్, హరిబాబు, ప్రవీణ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ బుచ్యానాయక్

రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఏడీఏ పుణ్యవతి

కౌడిపల్లి(నర్సాపూర్): రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ పుణ్యవతి అన్నారు. మంగళవారం రైతువేదికలో రైతులతో కలిసి రైతు నేస్తం వీడియో కన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా పంటలసాగులో జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై రైతులు సందేహాలు, సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం రూ. 2లక్షలలోపు రుణమాఫీ చేసిందన్నారు. రుణమాఫీ కాని అర్హులైన రైతులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రైతులు రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడొద్దని తెలిపారు. పంటలలో చీడపీడలు వ్యాపిస్తే వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం గౌతమి, ఏటీఎం నరేందర్, రైతులు పాల్గొన్నారు.



రైతులు సమస్యలను నివృత్తి చేస్తున్న ఏడీఏ

ప్రతి ఫిర్యాదును స్వీకరించాలి: సీఐ రంగాకృష్ణ

మనోహరాబాద్(తూప్రాన్): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదులను స్వీకరించి వెంటనే వాటిని పరిష్కరించాలని తూప్రాన్ సీఐ రంగాకృష్ణ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సీఐ సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుభాష్‌గౌడ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ

విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి

రామాయంపేట(మెదక్): విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, అనవసరంగా ఆందోళనకు గురికావొద్దని ప్రముఖ సైకాలజిస్ట్ దుర్గ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతీ విద్యార్థి మత్తు పదార్థాలు, సెల్‌ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి, సోషల్ వర్కర్ సురేశ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాగౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ దుర్గ

సంక్షిప్త వార్తలు

◆ పాత పెన్షన్ పునరుద్ధరించాలి

నర్సాపూర్: పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ చేయాలని తెలంగాణ రాష్ట్ర యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు రవి, నాగులమీరా డిమాండ్ చేశారు. వారు మంగళవారం మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు.

◆ రామాయంపేట ఎస్ఐగా బాల్‌రాజ్

రామాయంపేట(మెదక్): రామాయంపేట ఎస్ఐగా బాల్‌రాజ్ నియమితులయ్యారు. చేగుంట ఎస్ఐగా పనిచేస్తున్న బాల్‌రాజ్‌ను రామాయంపేట ఎస్ఐగా బదిలీచేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ రంజిత్ కామారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో బాల్‌రాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

◆ ప్రిన్సిపాల్ సేవలు అభినందనీయం

చిన్నశంకరంపేట(మెదక్): కళాశాలను జిల్లాలోనే నెంబర్‌వన్‌గా నిలిపిన ప్రిన్సిపాల్ శశిధర్ సేవలు అభినందనీయమని నార్సింగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం నార్సింగి ప్రభుత్వ కళాశాలలో బదిలీపై వెళ్లిన శశిధర్‌ను కళాశాల అధ్యాపక బృందం సన్మానించారు. నూతన ప్రిన్సిపాల్‌గా వచ్చిన నరేందర్‌గౌడ్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉన్నారు.

◆ చేగుంట ఎస్ఐగా చైతన్యకుమార్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): చేగుంట ఎస్ఐగా చైతన్య కుమార్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చేగుంటలో పని చేసిన ఎస్ఐ బాలరాజు రామాయంపేటకు బదిలీపై వెళ్లారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో విధులు నిర్వహిస్తున్న చైతన్యకుమార్‌రెడ్డి చేగుంటకు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఎస్ఐ పేర్కొన్నారు.

◆ హెచ్ఐవీపై అవగాహన

మెదక్‌జోన్: హెచ్ఐవీపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కౌన్సిలర్ రాజేశ్వర్, డీఎస్ఆర్‌సీ భవానీ అన్నారు. మంగళవారం రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో మెదక్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్ఐవీ నిర్మూలనకు అవగాహన ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాలల విద్యార్థులు, రెడ్ రిబ్బన్ క్లబ్, జంతు శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ విశ్వనాథం, సోమనాథ్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

◆ శ్మశాన వాటికలో పైపులైన్ వేయాలి

నర్సాపూర్: పట్టణానికి చెందిన మాల కులస్తులకు చెందిన శ్మశానవాటికలో మురికినీరు చేరింది. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని మాల కులస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మురికి నీరు రావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. శ్మశాన వాటికలో మురికి నీరు చేరుతుందని చెప్పగా, మున్సిపాలిటీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారన్నారు.

◆ దాతల సాయం వెలకట్టలేనిది



శివ్వంపేట(నర్సాపూర్): దాతల అందిస్తున్న సాయం వెలకట్టలేనిదని హెచ్ఎం మాధవి అన్నారు. మండలంలోని గూడూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పరీక్ష ప్యాడ్స్, నోట్ పుస్తకాలు అందజేశారు.

పెంచిన పన్నులు తగ్గించండి

తూప్రాన్: మున్సిపల్ పరిధిలో పెంచిన గృహ, వాణిజ్య, వ్యాపార సంస్థల పన్నులను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించి, కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పెంచిన పన్నులు తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహియుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో అధిక శాతం పన్నులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, వెంకట్‌గౌడ్, సత్య లింగం, మల్లేశ్, దుర్గారెడ్డి, సత్తార్, శ్రీకాంత్‌చారి, బాల్‌రాజ్, ఆంజనేయులు, నాగేందర్‌రెడ్డి, నర్సింగ్ రావు, కిషన్, ప్రవీణ్ రెడ్డి, మల్లేశ్, అంజయ్యయాదవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

డబుల్ బెడ్రూంలు ఇళ్లు అందించండి

చేగుంట(తూప్రాన్): అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూంలు ఇళ్లు అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ.. చేగుంటలో డబుల్ బెడ్రూంలు ఇళ్లు పూర్తయినా.. పేదలకు అందించలేదన్నారు. మండల కేంద్రంలో కూలీపనులు ఇతర పనులు చేసుకొని జీవించే వారంతా ప్రస్తుతం అద్దె డబ్బులు చెల్లించే పరిస్థితిలో లేరని తెలిపారు. ఈ విషయంలో అధికారులు స్పందించి పేదలకు డబుల్ బెడ్రూంలు ఇళ్లు ఇవ్వాలని తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు సత్తమ్మ, రజిత, శ్యామల, సంతోష, సాధిక రంజని, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో మంగళవారం మమత ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. అత్యవసర చికిత్స అవరమున్న రోగులను ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించి, మమత ఆస్పత్రిలో చికిత్స అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి, వైద్యులు ప్రమోద్ కిరణ్, పీఆర్ఓ సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.



అజ్జమర్రిలో రోగులకు మందులు రాస్తున్న వైద్యురాలు శ్రీలక్ష్మి

మాసాయిపేటలో..

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలో మంగళవారం మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంపై పలువురు నిర్వాహకులను అభినందించారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

రామాయంపేట(మెదక్): అధిక వర్షాలకు పలు పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై మంగళవారం రైతు వేదికలో జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు వివరించారు. ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల పిచికారీ అంశాలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు వీడియో ద్వారా అవగాహన కల్పించారు. రుణమాఫీ విషయమై రైతుల సందేహాలను అధికారులు సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను వ్యవసాయ అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారులు సాయికృష్ణ, రాజు, స్రవంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

సమస్యలు పరిష్కరించండి

రామాయంపేట(మెదక్): గ్రామాలకు ఆర్టీసీ బస్సులు సరిగా రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులపాలవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ ఆరోపించారు. ఆయన మంగళవారం రామాయంపేటలో ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు బస్సులు సరిగా రాకపోవడంతో వారు సకాలంలో తరగతులకు హాజరుకావడంలేదన్నారు. నేడు ప్రభుత్వ కళాశాలలు, స్కూళ్ల సమస్యల నిలయాలు అయ్యాయని, దీంతో చాలామంది నిరుపేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. బాలికల జూనియర్ కళాశాల హాస్టల్ పాక్షికంగా శిథిలమై విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అనంతరం తహశీల్దార్ రజనికుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్, మండల ఉపాధ్యక్షుడు సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

భారతి సిమెంట్ బీమా పత్రాలు పంపిణీ



మేస్త్రీకి బీమా పత్రాన్ని అందజేస్తున్న శ్రీకాంత్

రేగోడ్(మెదక్): సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్ ముందుందని సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. మండల కేంద్రం రేగోడ్‌లో మంగళవారం జమీల్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు సమావేశం నిర్వహించారు. అనంతరం మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ డీలర్ ఫాజిల్, అఖీల్, మేస్త్రీలు ఉప్పరి సాయిలు, బుదెయ్య, రాములు పాల్గొన్నారు.

కంచన్‌పల్లిలో పూరిగుడిసె దగ్ధం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లి ఎస్సీ కాలనీలో మంగళవారం పూరిగుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఏర్పుల శాఖయ్య పూరిగుడిసెకు మంగళవారం మంటలు అంటుకున్నాయి. ఇరుగు పొరుగు వారు వచ్చి మంటలను ఆర్పారు. దీంతో పూరిగుడిసె పాక్షికంగా దగ్ధమైంది. బియ్యం, వంటసామగ్రి, దుస్తులతో పాట పంట రుణమాఫీ డబ్బులు దగ్ధం అయినట్లు బాధితులు తెలిపారు. అధికారులు ఆదుకోవాలని వేడుకొన్నారు.